క్లుప్తంగా

తెరుచుకున్న ఆలయాలు.. భక్తులకు దర్శనాలు


వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రం

మురళీనగర్: చంద్ర గ్రహణం అనంతరం మురళీనగర్ పరిసరాల్లోని పలు ఆలయాల్లో సోమవారం దర్శనాలు పునఃప్రారంభమయ్యాయి. గ్రహణం ప్రభావంతో ఆదివారం ఉదయం 11 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించిన అనంతరం ఆలయాలు మూసివేశారు. ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, మురళీనగర్‌లోని రామాలయం, పట్టాభిరెడ్డితోటలోని దాసాంజనేయ స్వామి ఆలయం, సత్యానగర్ రామలింగేశ్వర స్వామి, సూర్యానగర్‌లోని యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయాలను మూసివేసిన విషయం తెలిసిందే. ఈ ఆలయాలల్లో సోమవారం ఉదయం 5.30 నుంచి సంప్రోక్షణ నిర్వహించారు. 10 గంటల తర్వాత ఆలయాలు తెరిచి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు.

డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని వినతి

తాటిచెట్లపాలెం: ఆటో డ్రైవర్లు, మోటారు కార్మికులకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికుల జీవనోపాధి బాగా దెబ్బతింటోందని, ప్రభుత్వం స్పందించి వీరికి ప్రత్యామ్నాయంగా జీవనోపాధి చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ సమస్యలపై చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కార్మిక నాయకులు తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి, యు.శివాజి, కె.దేవుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న జెడ్సీ రాము, కార్పొరేటర్ ఉషశ్రీ, శ్యామల దీపిక

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో సుమారు రూ.1.71 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటికి సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, బీజేపీ నాయకురాలు శ్యామల దీపికతో కలిసి శంకుస్థాపన చేశారు. శ్రీనివాసనగర్, జగన్నాథపురంలో బీటీ రోడ్లు, ఆర్‌సీసీ డ్రెయిన్లు, గెడ్డలపై బాక్సు కల్వర్టులు నిర్మించనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థులు కోసం విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కన్వీనర్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్ వి.రమణ మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేథా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ మొదలగు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు మేళా నిర్వహించగా.. వివిధ ట్రేడ్‌లకు చెందిన 510 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 348 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ డి.వెంకటేశ్వరరావు, అప్రెంటిస్ అడ్వైజర్ మూర్తి, ట్రైనింగ్ అధికారి హెచ్‌వీఎన్ శ్రీనివాస్, ఐటీఐ సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుదారులకు సమాచారమివ్వాలి

మహారాణిపేట: సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరుడు కోరిన ప్రతి సమాచారం ఇవ్వాల్సి ఉన్నా.. కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గ సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు షేక్ బాబ్జి ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్టీఐ ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం ద్వారా సమాచారాన్ని పొందే హక్కు ఉందన్నారు. దానిని కొంత మంది అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది ప్రజా హక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పౌరులకు సంతృప్తికరమైన సమాచారాన్ని సంబంధిత అధికారుల ద్వారా ఇప్పించాలని కోరారు.

రోడ్లు హీనం.. ఒళ్లు హూనం


శాంతిపురం రోడ్డులో ఏర్పడిన భారీ గోతులు


మధురానగర్ రహదారిలో శిథిలమైన కల్వర్టు


శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయం ఎదుట ప్రమాదకరంగా గొయ్యి


గణేష్‌నగర్ రోడ్డులో భారీ గొయ్యి

- 25వ వార్డులో దెబ్బతిన్న ప్రధాన రహదారులు
- రాకపోకల వేళ.. స్థానికులు, ప్రయాణికుల పాట్లు
- గోతులను గుర్తించలేక ప్రమాదాలు
- తక్షణం మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి


శాంతిపురంలో శ్రీనిధి అపార్ట్‌మెంట్ వద్ద రహదారి దుస్థితి


హైవేపై గురుద్వారా జంక్షన్ బస్ బే వద్ద ఏర్పడిన గోతులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులోని ప్రధాన రహదారులు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. రాకపోకల సమయంలో వాహన చోదకులు, పాదచారులు నానా తంటాలు పడుతున్నారు. వర్షా కాలం కావడంతో ఒకపక్క దెబ్బతిన్న రోడ్లు.. మరో పక్క వర్షపు నీటితో నిండిన రహదారుల్లోని గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వార్డులోని సీతంపేట, శాంతిపురం, శంకరమఠం రహదారుల్లో ఏర్పడిన గోతులతో స్థానిక ప్రజలు చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, వాకింగ్ ట్రాక్‌లు, స్మార్ట్ బస్ బేలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా.. కనీసం రహదారుల పునరుద్ధరణకు కూడా పాలకులు, అధికారులు కృషి చేయడం లేదని జనం మండిపడుతున్నారు.

శంకరమఠం రహదారిలో ప్రమాదకర గోతులు

హైవే నుంచి డైమండ్ పార్కుకు వెళ్లే శంకరమఠం ప్రధాన రహదారిలో పలు చోట్ల ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి. ఒకవైపు కురుస్తున్న వర్షాలు, మరోవైపు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో గోతులు కనపడగా నిత్యం ఎవరో ఒకరు వాటిల్లో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శంకరమఠం రోడ్డులో ఇన్‌కమ్‌టాక్స్ కార్యాలయం ఎదుట ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అదే రోడ్డులో రామలింగేశ్వరాలయం ఎదురుగా ఏర్పడిన గొయ్యి, విజయ గణపతి ఆలయం ఎదురుగా మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు శిథిలమై ప్రమాదభరితంగా తయారయ్యాయి. శంకరమఠం రహదారిలోని గోతులను తక్షణం పూడ్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాహన చోదకుల అవస్థలు

సీతంపేట మెయిన్ రోడ్ గురుద్వారా జంక్షన్ నుంచి శంకరమఠం రహదారికి వెళ్లే శాంతిపురం రోడ్డు శిథిలమైంది. గోతులు, చాలా చోట్ల తారు పోవడంతో అటుగా వెళ్లే వాహన చోదకులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలోని శ్రీనిధి అపార్ట్‌మెంట్ వద్ద రహదారి బాగా దెబ్బతింది. సీతంపేట కూడలి నుంచి జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌కు వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ గోతులు, వాటికి తోడు యూజీడీ మ్యాన్‌హోళ్లు రోడ్డు కంటే దిగువకు గోతుల్లా ఉండటం వల్ల స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గోతుల రహదారుల్లో ప్రయాణాలతో ఒళ్లు హూనమవుతోందని వాపోతున్నారు. సత్యం సెంటర్ హైవే నుంచి గణేష్‌నగర్‌కు వెళ్లే మార్గంలో వాకింగ్ ట్రాక్ సమీపంలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. పాత పెట్రోల్ బంక్ సమీపంలోని గొల్ల వీధిలో యూజీడీ మ్యాన్‌హోల్ చుట్టూ రోడ్డు శిథిలమై స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి రహదారులను బాగుచేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఒక్క అభివృద్ధి పనీ చేపట్టలేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 25వ వార్డులో రూ.కోట్ల విలువైన రహదారులు, డ్రెయిన్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, స్మార్ట్ బస్‌షెల్టర్లు, కల్యాణ మండపాలు, సామాజిక భవనాలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వార్డులో కొత్తగా ఒక్క అభివృద్ధి పనీ చేపట్టలేదు. రెల్లి వీధిలో నిర్మించిన కల్యాణ మండపం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రోడ్ల మరమ్మతులను గాలికొదిలేశారు.

– బోగవిల్లి గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు, సీతంపేట

శిథిలమైన రహదారులతో అవస్థలు



వార్డులోని సీతంపేట, శాంతిపురం, మధురానగర్, శంకరమఠం రహదారులు శిథిలమై అధ్వానంగా ఉన్నాయి. వాటిపై ప్రయాణించ లేక నెలల తరబడి అవస్థలు పడుతున్నాం. గత ప్రభుత్వంలో గురుద్వారా కూడలి వద్ద లక్షల రూపాయలు ఖర్చు పెట్టి స్మార్ట్ బస్ షెల్టర్ నిర్మించారు. అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోతోంది. రహదారుల సమస్యలను పరిష్కరించే నాథుడు కనిపించడం లేదు.

– డి.కోటేశ్వరరావు, సీతంపేట

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ధర్నా


జోన్–5 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కంచరపాలెం: ఔట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ కార్యదర్శి ఒమ్మి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికుల పెండింగ్ జీతాలను మంజూరు చేయడం లేదన్నారు. జోన్–5 పరిధి కార్మికులకు ప్రతి నెలా జీతాలు పడటం లేదని చెప్పారు. చనిపోయిన, రిటైర్డ్, సిక్ కార్మికుల పిల్లలకు ఆప్కాస్ ద్వారా తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేసిన కార్మికులు, సీఐటీయూ నాయకులు జోనల్ కమిషనర్ రామును కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రావణ్, కుమార్, వి.మహేశ్వరి, కన్నతల్లి, బాలరాజు, పాపారావు, రమణమ్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి తిలారు–ఉర్లాం–శ్రీకాకుళం– దూసి–పొందూరు లైన్ల పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు విశాఖపట్నం–బ్రహ్మపూర్ (58532) పాసింజర్, ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మపూర్–విశాఖపట్నం (58531) పాసింజర్‌లు రద్దు చేశారు.

- ముంబయి డివిజన్, కళ్యాణ్– లోనావాలా సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 10వ తేదీన పూణే వరకు మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ తొలగింపు

అక్టోబరు 10, 11వ తేదీల్లో బయల్దేరే భువనేశ్వర్ న్యూ–ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు కజ్రత్ స్టేషన్‌లో హాల్ట్‌ను తొలగించారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు


వ్యాస రచన పోటీ విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నేత్ర దాన ఆవశ్యకత, వాటిపై ఉన్న అపోహలు తొలగేలా 15 రోజుల పాటు నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేలా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వద్ద కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించినట్టు డాక్టర్ మీనాక్షి తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు జ్యోతిర్మయి, నవీన్‌కుమార్, శ్రీలక్ష్మి, ఐ బ్యాంక్ మేనేజర్ అభినీత్, నేత్ర వైద్యశాల సిబ్బంది, ఏఎంసీ విద్యార్థులు, మోహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండవాలులో మౌలిక సదుపాయాలు కల్పించండి


అడిషనల్ కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత సోమవారం పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందించారు. వార్డులోని న్యూశ్రీనివాస్‌నగర్, ఇందిరానగర్–3లో పేదలకు అందుబాటులో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, వర్షా కాలం దృష్ట్యా కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వార్డులో విద్యుత్ స్తంభాలు, సీసీ కెమెరాలు, నూతన సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, అదనపు పారిశుధ్య కార్మికులను నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

జోన్–5కు రెండే వినతులు


జోన్–5 కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు అందిన అర్జీలను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను ఆదుకోండి మహాప్రభో..


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

దాబాగార్డెన్స్: గత 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టర్లు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంఎస్ఎంఈ నేషనల్ బోర్డు సభ్యుడు విష్ణుకుమార్‌రాజును, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ టి. శివశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.420 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, దసరా పండుగ వస్తుండటంతో కూలీలకు డబ్బులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 6 నెలలకే బిల్లులు చెల్లించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా బిల్లులు చెల్లించలేదని వారు వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. కనీసం 6 నెలల బిల్లులు అయినా చెల్లించాలని కోరారు. అలాగే ఎంఎస్ఎంఈ ద్వారా టీఆర్ఈడీఎస్ ప్లాట్‌ఫాం ద్వారా బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం. సంజీవరెడ్డి, జి.సింహాచలం, మద్దాల రమేష్, సిరికి శ్రీనివాసరావు, షేక్ సిలార్ పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 23 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితులకు రిమాండ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న 23 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు తమ సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాకు చెందిన సన్నీ కుమార్‌రామ్, బిహార్ గోపాల్‌గంజ్ జిల్లాకు చెందిన దిలీప్‌సింగ్ ఒడిశా నుంచి విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా ఉత్తర్‌ప్రదేశ్ ఆగ్రాకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని, సుమారు రూ.1.15 లక్షల విలువైన 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

వైద్య సేవల కోసం ప్రత్యేక వాహనం


జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: చిన్నపిల్లల్లో వైకల్యం తగ్గించడానికి, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేక వాహనం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. చికిత్సలకు పూర్తి ఉచితంగా తీసుకెళ్లడానికి వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన వాహనాన్ని సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అన్ని పథకాలకు ఈ వాహనం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ హారిక, జిల్లా మీడియా విస్తరణాధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె.అప్పారావు, మేనేజర్ శాంతిప్రియ, వైద్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజా సంక్షేమానికి పాతర


జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాల్లో ఆరితేరారని 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అన్నారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో సోమవారం జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చంద్రబాబు మోసపూరిత హామీలు, కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటా ప్రచారం చేసి, కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు పాతర వేశారని విమర్శించారు. గత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు కంటే అదనంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించామని గుర్తు చేశారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలనే చైతన్యాన్ని ప్రజల్లో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, కిషోర్, పరశురామ్, శ్రీను, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రజలందరికీ ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సెమినార్ హాలులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తిస్తే మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, పలు విభాగాల అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పూజా వివరాలకు 0891 – 2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.